క్లుప్తంగా

నేటి నుంచి జగనన్న సురక్ష వైద్య శిబిరాలు

చినరావూరులో నేడు వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం బుధవారం నుంచి తెనాలి పట్టణంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం చినరావూరులో మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. స్పెషలిస్ట్ వైద్యులు శిబిరంలో వైద్యసేవలు అందిస్తారన్నారు. ప్రజలందరూ ఈ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ



తెనాలిఅర్బన్: అయోధ్యలోని రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను మంగళవారం 35వ వార్డులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గొడవర్తి శ్రీ సాయి హరేరామ్ ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రతిష్ట రోజు ఆలయాల్లో పూజలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే సాయంత్రం ఆరు గంటలకు ఐదుదీపాలు వెలిగించి పండుగ చేసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యదర్శి హనుమంత ప్రసాద్, లక్ష్మీనారాయణ, నటరాజ్, నాగార్జున, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులపై కేసు నమోదు

తెనాలిరూరల్: పురపాలక సంఘంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పారిశుద్ధ్య కార్మికులిద్దరిపై కేసు నమోదైంది. ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. దీని కారణంగా రెగ్యులర్ కార్మికులతో పారిశుద్ధ్య నిర్వహణను అధికారులు చేపడుతున్నారు. రెగ్యులర్ కార్మికులను విధులకు వెళ్లనివ్వకుండా సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఇద్దరిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్టు మంగళవారం రాత్రి తెలిపారు.

బీజేపీ మండల పార్టీ అధ్యక్షునిగా నందకిషోర్

తెనాలిటౌన్: తెనాలి రూరల్ మండలం బీజేపీ అధ్యక్షునిగా అంగలకుదురు గ్రామానికి చెందిన కడియాల నంద కిషోర్ నియమితులయ్యారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నందకిషోర్‌కు నియామక పత్రాన్ని రాష్ట్ర అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ అందజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మండల గ్రామాల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కె.వాసుదేవనాయుడు, టి.రఘు, రామాంజనేయులు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

చివరి పంట భూములకు నీరివ్వండి



తెనాలిటౌన్: కొమ్మమూరు కాల్వ చివరి పంట భూములకు సాగు నీరు ఇవ్వాలని కోరుతూ రైతు సంఘం నాయకులు మంగళవారం ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కాల్వ చివరి భూములు 20 వేల ఎకరాలకు రెండు తడులు నీరు ఇవ్వాలని, చిరుపొట్ట దశలో ఉన్న పంటను కాపాడాలని కోరారు. నీరు విడుదల చేయకపోతే పంట దెబ్బతింటుందని, దీనితో రైతులు ఆత్మహత్యలకు పాల్పడతారని చెప్పారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి తూబాటి శ్రీకాంత్, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

పట్నంబజారు: నివాసంలో పేకాటాడుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. శీలంవారి వీధిలో ఓ నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.33,300, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన 15 సంవత్సరాల బాలిక సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనిపించలేదు. ఆమె ఆచూకి కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మంచుతో కప్పిన రోడ్డు



ఐతానగర్‌లో కురిసిన మంచు

మంచు దుప్పటిలో తెనాలి

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని ఐతానగర్‌ను మంగళవారం ఉదయం మంచు కప్పేసింది. ఉదయం నుంచి విపరీతమైన మంచు కురవడంతో రోడ్లు కనిపించలేదు. తెల్లవారు జాము నుంచి ఉదయం 10 గంటల వరకు ఆ ప్రాంతాన్ని మంచు కమ్ముకుంది. దీంతో ప్రజలు కొంత ఇబ్బందులు పడ్డారు.

బాధ్యతతో పనిచేసి మంచిపేరు తీసుకురండి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, చైర్మన్ రాధిక

తెనాలిఅర్బన్: బాధ్యతతో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి పట్టణంలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టుల్లో ఎంపికైన వారికి మంగళవారం కౌన్సిల్ హాల్‌లో నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధులు వలంటీర్లు అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి పౌరసేవలను సులభతరం చేసిందన్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువరానివని కొనియాడారు. రానున్నది ఎన్నికల సమయమని, అందరూ సమష్టిగా పనిచేస్తూ మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చే విధంగా చూడాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ ఎం.జశ్వంతరావు, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, కుర్రా సుజాత, గొడవర్తి శ్రీ సాయి హరేరామ్, మట్లపూడి సంధ్యారాణి, వైఎస్సార్‌సీపీ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఏవో వెంకటేశ్వర్లు

తెనాలిటౌన్: ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలను ప్రతి రైతు అందుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు కోరారు. మార్కెట్ యార్డు ఆవరణలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల వ్యవసాయాధికారులు, వీఏఏ, వీహెచ్‌ఏ, ఎంపీఈవో, ఏఈవోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తెనాలి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.ఉషారాణి అధ్యక్షత వహించారు. శిక్షణలో డీఏవో మాట్లాడుతూ రైతు భరోసా, పీఎం కిసాన్, నష్ట పరిహారాలు ప్రతి రైతుకు రావాలన్నారు. రైతులు బ్యాంకు ఖాతానంబర్లు, ఆధార్‌కార్డులు, ఈ కేవైసీ, ఎన్‌పీసీజేలు తప్పనిసరిగా లింక్ చేయించుకోవాలన్నారు. ఏడీఏ ఉషారాణి మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేస్తున్న ప్రతి పంటను రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకునే విధంగా అధికారులు చూడాలని కోరారు. శిక్షణలో వ్యవసాయాధికారులు జి.ప్రేమ్‌సాగర్(తెనాలి), వెంకట్రావు(కొల్లిపర), శిరీష(దుగ్గిరాల), ఏఈవో, ఎంపీఈవో, వీఏఏ, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల డీలర్లకు అవగాహన సదస్సు..

సబ్ డివిజన్ పరిధిలోని తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డీలర్లు చట్టానికి లోబడి వ్యాపారం చేయాలన్నారు. లైసెన్స్‌లో ఉన్న కండిషన్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. బిల్లు పుస్తకాలు, స్టాక్ బోర్డులు కచ్చితంగా ఉండాలన్నారు. నాణ్యత కలిగిన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని సూచించారు. డీలర్లు ఆథరైజ్డ్ విత్తనాలు మాత్రమే అమ్మాలన్నారు. ఏడీఏ ఉషారాణి మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా వ్యాపారం చేసినట్లయితే లైసెన్స్‌లు రద్దు చేయబడతాయన్నారు. తెనాలి ఏవో ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ డీలర్లు నాణ్యత కలిగిన కంపెనీల మందులు మాత్రమే అమ్మాలని, రైతులకు నష్టం కలిగే మందులు అమ్మకూడదని అన్నారు. కొల్లిపర ఏవో వెంకట్రావు మాట్లాడుతూ ఎరువుల అమ్మకంలో డీలర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విత్తనాలు అమ్మే డీలర్లు స్థానిక ల్యాబ్‌లో పరీక్షలు చేయించి విక్రయించాలని సూచించారు. సదస్సులో దుగ్గిరాల ఏవో శిరీష, ఏఈవోలు, ఎంపీఈవోలు, పురుగు మందులు, విత్తనాలు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వి.కేదారనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యాశాఖ, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు జి.నాంచారయ్య, ఎంఈవో-1, 2 సాల్మన్‌రాజ్, ఝాన్సీలత చేతుల మీదుగా ఆంగ్ల నూతన సంవత్సర కాలమాని(క్యాలెండర్), డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు మాట్లాడుతూ ఉద్యోగులందరికీ నూతన ఆంగ్ల సంవత్సరంలో మంచి జరగాలని ఆకాంక్షించారు. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపి స్వీట్‌లు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు సీహెచ్ శివశంకర్, కార్యదర్శులు షేక్ కాలేషావలి, మృత్యుంజయరావు, చింతయ్య, వహాబ్, సత్తార్, భూపతి నాయుడు, రాము, సాయిబాబు పాల్గొన్నారు.

ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య

కర్లపాలెం: గ్రామీణ వైద్యుడిగా పనిచేస్తున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కర్లపాలెంలో చోటు చేసుకుంది. కర్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్లపాలెంలో గ్రామీణ వైద్యుడిగా పనిచేస్తున్న ఓలేటి విజయకుమార్(సాయి) (26) సోమవారం రాత్రి తన ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. అతని భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

రేపల్లెరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని పిరాట్లంక గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. చోడాయపాలెం ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ వివరాల మేరకు ముందస్తుగా అందిన సమాచారంతో పిరాట్లంక గ్రామంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాగమల్లేశ్వరరావు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మెప్మా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి మెప్మా రాష్ట్ర కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం నిర్వహించారు. మెప్మా ఎండీ వి.విజయలక్ష్మి కేక్ కట్ చేసి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేసి, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. మహిళలు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు గంగులయ్య, ప్రధాన కార్యదర్శి డి.పెంచలయ్య, కోశాధికారి అప్పలనాయుడు, రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అహ్మద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణకు కార్మికులు సహకరించాలి

మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల



ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు



పట్టణంలో చెత్త సేకరిస్తున్న రోజువారి కూలీలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో చెత్త సేకరణకు ఎటువంటి అవరోధాలు కలిగించకుండా కార్మికులందరూ సహకరించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఉదయం జరుగుతున్న చెత్త సేకరణ పనులను సీఐటీయూ నాయకులు, కార్మికులు అడ్డుకున్నారు. రోజువారి కూలీలతో చెత్తసేకరణ జరపవద్దు అంటూ డిమాండ్ చేశారు. దీంతో డాక్టర్ హెలెన్ నిర్మల వారితో మాట్లాడి వారిని శాంతిపజేసే ప్రయత్నం చేశారు. బుధవారం నుంచి పట్టణంలో చెత్త సేకరణను నిలిపివేయాలని లేకుంటే అడ్డుకుంటామని కార్మికులు హెచ్చరించి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి అవరోధాలు లేకుండా చెత్తసేకరణ జరుపుతున్నట్లు చెప్పారు. ప్రతి రోజు దినసరి కూలీలతో చెత్తసేకరణ జరుపుతున్నట్లు చెప్పారు. కార్మికులు కూడా అర్థం చేసుకోవాలన్నారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, మేస్త్రీలు ఉన్నారు.

తైక్వాండో పోటీల్లో ఫాతిమాకు ద్వితీయ స్థానం



తెనాలిఅర్బన్: ఛాన్ హన్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఫెడరేషన్, బోధిధర్మ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెనాలి నెహ్రూనికేతన్ పాఠశాలకు చెందిన షేక్ సనా ఫాతిమా ద్వితీయ స్థానం సాధించిందని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ తెలిపారు. బాలికను పాఠశాల ఆవరణలో మంగళవారం అభినందించి సర్టిఫికెట్ అందజేశారు.

విద్యార్థి దశ నుంచే ఆచరణాత్మక జ్ఞానం అవసరం

ప్రముఖ క్లినికల్ ఫార్మాసిస్ట్ ఎక్స్ అఫీషియో మెంబర్ మన్నిషా దోషి



తాడేపల్లిరూరల్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు ఆచరణాత్మక జ్ఞానం కలిగి ఉండాలని ప్రముఖ క్లినికల్ ఫార్మసిస్ట్ ఎక్స్ అఫీషియో మెంబర్, ఎఫ్ఐపీ (ఇంటర్నేషనల్ ఫార్మసీ ఫెడరేషన్) మన్నిషా దోషి అన్నారు. మంగళవారం మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామంలో ఉన్న నిర్మల ఫార్మసీ కళాశాలలో బ్రిడ్జింగ్ ది గ్యాప్ బిట్వీన్ అకాడమియా అండ్ ప్రాక్టీస్ అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంత పరమైన జ్ఞానంతో ఉద్యోగాన్ని సాధించలేరని, ఒక వేళ సాధించినా ఎక్కువ కాలం ఆ ఉద్యోగాన్ని చేయలేరని అన్నారు. విద్యార్థులు ఆచరణాత్మకమైన నైపుణ్యం కలిగి ఉంటే ఎక్కడైనా ఉద్యోగం చేయగలరని అన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల రెడ్డి, రెగ్యులేటరీ ఎఫైర్ విభాగం అధిపతి డాక్టర్ ఎం.సుధీర్, సందీప్, ఒమన్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్



పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న గుల్జార్ బేగం

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని కాకుమాను, రేటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. విద్యతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలనే సంకల్పంతో నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మార్చి నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేశారని ఆమె తెలిపారు. పదవ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి కష్టపడి చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి డాక్టర్ షేక్ అసదుల్లా, ఎంఈఓలు కె.ఎఫ్.కెనడీ, విజయ భాస్కర్, హెచ్‌ఎం సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బాలరాముని అక్షింతల వితరణ



శోభాయాత్రలో పాల్గొన్న ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు, భక్తులు

భట్టిప్రోలు: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం గొరిగపూడి పంచాయతీ పరిధిలోని దాసరిపాలెం, వరికూటివారిపాలెం గ్రామాల్లో మంగళవారం అయోధ్య బాలరాముని అక్షింతల వితరణ కార్యక్రమం జరిగింది. గ్రామ పురవీధులలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్లపల్లి శివనాగమల్లేశ్వరరావు గురుస్వామి, ఎస్ఎస్ఎఫ్ సాంస్కృతిక విభాగం బాపట్ల జిల్లా ఖండ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణలు మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటా రామనామస్మరణ చేస్తూ సాయంకాలం ఇంటి ముందు 5 వొత్తులతో దీపారాధన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నిర్వాహకులు వరికూటి శివగోపి, ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు బండారు జ్వాలా నరసింహ, రామిశెట్టి నరసింహారావు, మోదడుగు సూరిబాబు, మురళీకృష్ణ, లంక కృష్ణకుమారి, పేరం కోటేశ్వరరావు, శొంఠి బాబురావు, వరికూటి రంగరాజ పెరుమాళ్ళు, చిట్టెమ్మ, సీతామహాలక్ష్మి, సత్యన్నారాయణ, రేపల్లె ఆంజనేయులు, బి. వేదవతి పాల్గొన్నారు.

క్రీడలు చదువులో అంతర్భాగం కావాలి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



బాస్కెట్‌బాల్ ఫ్లడ్ లైటింగ్ వ్యవస్థను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, పక్కన శివాజీ, విష్ణువర్ధన్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాసంస్థల్లో క్రీడలు చదువులో అంతర్భాగంగా అమలు చేయాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నూతనంగా నిర్మించిన బాస్కెట్ బాల్ కోర్టు ఫ్లడ్ లైటింగ్ వ్యవస్థను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏ పనైనా ప్రారంభించే ముందు సరైన ప్రణాళికతో ఆచరణాత్మకంగా అమలు చేయడం ద్వారా విజయం సాధించి, ఉన్నతస్థాయికి చేరుకోవచ్చునని అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి, మెరుగైన క్రీడాకారులుగా ఎదిగి, జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపాలని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాలను వెలికితీయడమే క్రీడల లక్ష్యమని చెప్పారు. విద్యార్థులను అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఆధునికంగా తీర్చిదిద్దిన బాస్కెట్ బాల్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, హెచ్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి గుంటుపల్లి హరగోపాల్, బాస్కెట్‌బాల్ కోచ్‌లు రవి, నాగ తులసి పాల్గొన్నారు.

జిల్లా ఏఆర్ డీఎస్పీకి సత్కారం

నగరంపాలెం: జిల్లా ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్‌రావు సుమారు మూడేళ్లు సమర్థంగా విధులు నిర్వహించారని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. ఏలూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్‌రావుకు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సభలో సత్కరించారు. జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (పరిపాలన) మాట్లాడుతూ కోవిడ్-19 వేళల్లోనూ పోలీస్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి నిర్వహణ కేటాయింపులోనూ సమర్థంగా పనిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ కె.కోటేశ్వరరావు, ఆర్ఐలు రాజారావు, రమేష్‌కృష్ణన్, రాఘవయ్య పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) వలంటీర్లు ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటా నగర్‌లో నిర్వహించనున్న జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ డి.రవి శంకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ శిబిరంలో 15 రాష్ట్రాల నుంచి వలంటీర్లు పాల్గొంటున్నట్లు చెప్పారు. అందులో విద్య, సంస్కృతి సంప్రదాయాలు, ఆర్థిక, భాషా పరమైన అంశాల్లో పోటీపడతారని వివరించారు. శిబిరానికి హాజరయ్యే వర్సిటీ జట్టుకు ఎస్.కె. మొహమ్మద్ బాషా నాయకత్వం వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వలంటీర్లను ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో చదువుతోపాటు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన, ఆర్థిక, భాషాపరమైన అంశాలలో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరానికి వలంటీర్లు ఎం. హాజస, బి.ఐశ్వర్య, ఎం.శిరీష, పీవీఎస్ భార్గవి, బి.దేవిక, డి.సంతోష్ కుమార్, బి.మొహమ్మద్ హుస్సేన్, సిహెచ్.సాత్విక్, ఏ గణేష్, జి.వంశీ ఉన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ తదితరులు వలంటీర్లను అభినందించారు.

విద్యావేత్త శ్రీమన్నారాయణకు సత్కారం



శ్రీమన్నారాయణను సత్కరిస్తున్న కన్నా మాస్టారు, కొండా శివరామిరెడ్డి, అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: వేలాది మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన శాంతా కాలేజీ శ్రీమన్నారాయణను ప్రైవేటు విద్యాసంస్థలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం శాంతాకాలేజీ శ్రీమన్నారాయణను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ కన్నా మాస్టారు మాట్లాడుతూ గుంటూరు విద్యా కేంద్రంగా అభివృద్ధికి శ్రీమన్నారాయణ అని కొనియాడారు. ఈయన వద్ద విద్యనభ్యసించిన పలువురు విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడ్డారని కొనియాడారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకొచ్చిన శ్రీమన్నారాయణ అభినందనీయులన్నారు. ఈసందర్భంగా శ్రీమన్నారాయణను సంస్థ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పి.ఎస్.మూర్తి, జయకుమార్ పాల్గొన్నారు.

బాబా ఆలయంలో జయంతి వార్షికోత్సవాలు ప్రారంభం

భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో 79వ ధనుర్మాస జయంతి వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాబావారికి ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, కాకడ హారతి శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎం. సాంబశివరావు, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన కమిటీ నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలన, పతాకావిష్కరణ చేశారు. సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం అధ్యక్షురాలు బూర్లె అరుణ కుమారి ఆధ్వర్యంలో గీతా పారాయణం జరిగింది. రాత్రి షిరిడీ సాయిబాబా, ఆంజనేయ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ప్రవచనాలతో స్తోత్రాలు, స్తుతులు, గేయాలను హేమ విఠలేశ్వర స్వామి దేవస్థాన కమిటీ మహిళా సమాజం ఆర్గనైజర్ అల్లం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి పల్లకీ, ఊయల, పవళింపు సేవలు, శేజా హారతి నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం. సాంబశివరావు, కోశాధికారి బూర్లె కిరణ్‌కుమార్‌లు కార్యక్రమాలను పర్యవేక్షించారు.